

అనకాపల్లి సతకంపట్టు ఆలయంలో స్వర్ణ కవచ అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గాదేవి



ఐటీ సేవలు మరింత విస్తృతం

- పాలనలో సంస్కరణలు అమలుచేస్తాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొన్న అనంతరం కేంద్ర అధికారులతో భేటీ
- ఆర్‌టీజీఎస్ అమలు, ఇంకా తీసుకోవలసిన చర్యలపై చర్చ



'డిజిటల్ ఏపీ' సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా సమస్యల విభాగం సెక్రటరీ వి.శ్రీనివాస్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎన్ఐసీ అదనపు కార్యదర్శి అభిషేక్‌సింగ్, ఏపీ ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ ఉన్నారు.

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ సేవలు మరింత విస్తృతం చేస్తామని, పరిపాలన సంస్కరణలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నోవాటెల్ హోటల్‌లో సోమవారం ప్రారంభమైన 28వ జాతీయ

... మిగతా 8వ పేజీలో

శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభం



నూకాంబిక అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లాలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో సోమవారం శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం అయ్యాయి. అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు గ్రామాల్లో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపులు నిర్వహించారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్సవమూర్తికి పూజలు చేసి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. కన్యకాపరమేశ్వరి, కనకదుర్గమ్మ, కామాక్షిదేవి తదితర ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పలుచోట్ల మండపాలు నిర్మించి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు.

లాభం..GST అంతంతమాత్రం!

జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకాని జీఎస్టీ కొత్త శ్లాబులు

కేంద్రం ఆదేశించినా పట్టించుకోని వ్యాపారులు

- పాత ధరలనే వసూలు చేసిన వైనం
- నిత్యావసర సరకుల ధరల్లో ఎటువంటి మార్పూ లేదు
- అసంతృప్తిగా వినియోగదారులు
- ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుట్‌వేర్, కార్లు, బైకుల రేట్లు మాత్రం తగ్గింపు



అనకాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలుచేసిన జీఎస్టీ నూతన శ్లాబుల విధానం జిల్లాలో తొలిరోజు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటివరకు అమల్లో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో, కేవలం 5, 18 శాతం శ్లాబులను కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం నుంచి కొత్త శ్లాబులను అనుసరించి విక్రయాలు సాగించాలని ఆదేశించింది. అయితే జిల్లాలో అనేక వస్తువుల ధరలను తగ్గించేందుకు వ్యాపారులు ఇష్టపడలేదు.

ముఖ్యంగా నిత్యావసర సరకులు, మందులు, ఫుట్‌వేర్, వస్త్రాలపై నూతన జీఎస్టీని అనుసరించి ధరలను తగ్గించాల్సి ఉండగా, వ్యాపారులు పట్టనట్టు వ్యవహరించారు. వినియోగదారులు ప్రశ్నిస్తే పూర్తిస్థాయిలో సమాచారం రాలేదని వాదిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే తాము జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేసిన సరకులను తగ్గించి అమ్మడం సాధ్యం కాదంటున్నారు. కాగా ఎలక్ట్రికల్ వస్తువులు, కార్లు, బైక్‌లపై తగ్గిన శ్లాబులు అమల్లోకి వచ్చాయి. వాటికి దసరా ఆఫర్లు తోడవడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎగబడ్డారు.

తగ్గాల్సిన వస్తువులు ఇవే..

మిల్క్, చీజ్, పిజ్జా, బ్రెడ్, ఖాఖ్రా,

... మిగతా 8వ పేజీలో

కిరాణా సామగ్రిపై కానరాని జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ నర్సీపట్నంలో కిరాణా సామగ్రి ధరలు ఇసుమంతైనా తగ్గలేదు. ఇప్పటి వరకు ఐదు శాతం శ్లాబ్‌లో వున్న కిరాణా సామగ్రిపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఏ ఒక్క సరకు ధర తగ్గలేదని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. ఆయా సామగ్రిని ఆదివారం వ్యాపారులు ఏ ధరలకు విక్రయించారో, సోమవారం కూడా అవే ధరలకు విక్రయించారు. వంట నూనె లీటర్ ప్యాకెట్ (ఫ్రీడమ్) రూ.150, కంది పప్పు రూ.105, పెసర పప్పు 110, మినపప్పు రూ.150, వేయించిన శనగపప్పు రూ.140, గోధుమ పిండి (బ్రాండెడ్) రూ.63, పంచదార రూ.48, బెల్లం రూ.50, బియ్యం బస్తా (26 కిలోలు) రూ.1,425 ఉన్నాయి. ఆది, సోమవారాల్లో వీటి ధరల్లో ఎటువంటి మార్పు కనిపించలేదని వినియోగదారులు పేర్కొన్నారు. ప్యాకెట్ పాలు మినహా మిగిలిన నిత్యావసర ధరలు యథావిధిగా వున్నాయని చెబుతున్నారు.

అంధకారంలోనే ఎలమంచిలి

రెండో రోజూ విద్యుత్ సరఫరాకు నోచుకోని పలు ప్రాంతాలు

విరిగిన స్తంభాలు, తెగిన వైర్ల పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది బిజీ



మెయిన్ రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం వద్ద విద్యుత్ వైర్లపై పడిన చెట్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎలమంచిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి కూడా అంధకారంలోనే వున్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్, మునిసిపల్, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపపట్టినప్పటికీ గాంధీనగర్, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ



గాంధీనగర్ ప్రాంతంలో విరిగిన విద్యుత్ స్తంభం

బస్టాండ్ జంక్షన్, పోస్టాఫీసు రోడ్డు ప్రాంతాల్లో సోమవారం రాత్రి పది గంటలకు కూడా కరెంటు రాలేదు. ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతోపాటు భారీ వర్షం కారణంగా చెట్లు కూలిపోయి విద్యుత్ వైర్లపై పడడంతో స్తంభాలు విరిగిపోయిన విషయం తెలిసిందే. విద్యుత్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి పునరుద్ధరణ పనులు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు మిలటరీ కాలనీ, కొత్తపేట, కోర్టుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పట్టణంలో మిగిలిన ప్రాంతమంతా అంధకారంలోనే వుంది. దీంతో ఉక్కపోత, దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయాన్నే రంగంలోకి దిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రధాన రహదారి వెంబడి వున్న ప్రాంతాలతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వినియోగదారులతోపాటు విద్యుత్‌పై ఆధారపడి వ్యాపారాలు చేసే

... మిగతా 8వ పేజీలో



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లు

నేటి నుంచి ఉపమాకలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- నిత్యం తిరువీధి సేవ
- 2వ తేదీన పూర్ణాహుతితో ముగింపు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఉభయదేవేరులతో స్వామివారు

నక్కపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఉత్సవ కావిడితో ఘనంగా ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల తొలిరోజు ఉదయం ఉత్సవ కావడి ఊరేగింపు, సాయంత్రం పుణ్యాహవాచనం, పుట్టమన్ను సేవ, రాత్రి తిరువీధి సేవ, విశేష హోమాలు జరుగుతాయని ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు చెప్పారు. 24వ తేదీన భేరీ పూజ, పెద్దపల్లకీలో తిరువీధి సేవ, మాఢవీధుల్లో అష్టదిక్పాలకుల ఆవాహనం, ధ్వజారోహణం, రాత్రికి శేష తల్ప వాహనంపైతిరువీధి సేవ, 25వ తేదీ ఉదయం రాజాధిరాజ వాహనం, రాత్రి హంస వాహనంపై తిరువీధి సేవ, 26వ తేదీ ఉదయం సప్పరం వాహనం, రాత్రి పెద్ద పల్లకీపై, 27వ తేదీన అంజనేయ వాహనం, రాత్రికి లక్క గరుడ వాహనంపై, 28వ తేదీ ఉదయం సప్పరం, రాత్రి రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ జరుగుతాయి. 29వ తేదీ సాయంత్రం గరుడవాహన సేవ, వసంతోత్సవం, 30వ తేదీ రాత్రి పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవ, అక్టోబరు ఒకటో తేదీ సాయంత్రం పుష్కరిణి వద్ద మృగవేట, అనంతరం గజవాహనంపై తిరువీధి సేవ జరుగుతాయి. 2వ తేదీన పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ సందర్భంగా ఆలయం లోపల, బయట విశాలమైన టెంట్లు ఏర్పాటు చేశారు.

కుండపోతగా వాన

- పలు మండలాల్లో గంట నుంచి మూడు గంటలపాటు భారీ వర్షం
- పొంగి ప్రవహించిన గెడ్డలు, వాగులు
- వరి, చెరకు, కూరగాయ పంటలకు మేలు



కోటవురట్లలో...



రావికమతం మండలం కొమిరలో వర్షం



కృష్ణాదేవిపేటలో జోరు వాన

రావికమతం/ కోటవురట్ల/ కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాయడంతోపాటు గాలి వీయకపోవడంతో ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. రావికమతం మండలంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. చెరువులు పూర్తిగా నిండిపోయి అలుగులు పారాయి. వరి, చెరకు, సరుగుడు, జీడిమామిడి తోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం,

... మిగతా 8వ పేజీలో

100 కిలోల గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు
- రెండు కార్లు, ఒక వ్యాన్ సీజ్
- నిందితుల్లో ఐదుగురు అల్లూరి జిల్లా వాసులు

కోటవురట్ల, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లి వద్ద సోమవారం ఉదయం పోలీసులు వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు ఇక్కడ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి నర్సీపట్నం, కోటవురట్ల మండలాల మీదుగా జాతీయ రహదారిపైకి గంజాయి తరలిస్తు న్నట్టు కోటవురట్ల పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నర్సీపట్నం వైపు నుంచి కోటవురట్ల మండలంలోకి ప్రవేశించే యండపల్లి వద్ద నిఘా పెట్టారు. ఉదయం 11 గంటల



మీడియా సమావేశంలో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, నిందితులు (వెనకు వైపున...)

సమయంలో రెండు కార్లలో తీసకువచ్చిన గంజాయి మూటలను వ్యాన్‌లోకి ఎక్కిస్తుండగా ఎస్ఐ

... మిగతా 8వ పేజీలో

హైవేపై బ్లాక్ స్పాట్‌ల పరిశీలన

- తరచూ ప్రమాదాలపై అధికారుల సమీక్ష



తాళ్లపాలెం కూడలి వద్ద బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కశింకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా కార్యక్రమంలో భాగంగా స్థానిక సీఐ అల్లు స్వామినాయుడు, అనకాపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లీలాప్రసాద్, జాతీయ రహదారి భద్రత అధికారులు సోమవారం కశింకోట మండలంలో జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కశింకోట, తాళ్లపాలెం కూడలి, నర్సింగబిల్లి, ఎన్.జి.పాలెం ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరగడంపై చర్చించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన రంగనాయకులు


చంద్రబాబుకు పుష్పాన్ని అందజేస్తున్న రంగనాయకులు

రాంబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు సోమవారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు స్వాగతం పలికారు. ప్రభుత్వంపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారని రంగనాయకులు తెలిపారు.

మోదీ, నిర్మలా సీతారామన్‌లకు పాలాభిషేకం


మోదీ, నిర్మలా సీతారామన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్నులు తగ్గించడం సాహసోపేతమైన చర్య అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, నిర్మలా సీతారామన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా దేశ ఆర్థిక పరిస్థితి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు కూండ్రపు నాయుడుబాబు, బండారు నాయుడు, కర్రి వెంకటస్వామి నాయుడు, జోగినాయుడు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లిలో సోమవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న గెడ్డమూరి నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. సత్యవరం గ్రామానికి చెందిన గెడ్డమూరి నాగేశ్వరరావు అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకోవడంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.1,01,595 మంజూరయ్యాయి. లబ్ధిదారులకు గెడ్డం బుజ్జి చేతుల మీదుగా ఆ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నామవరం సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, సుంకర సూరిబాబు పాల్గొన్నారు.

'అచ్చెన్న చెరువు తవ్వకాలు నిలిపివేయాలి'

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరంలో గల అచ్చెన్న చెరువులో అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని అదే గ్రామానికి చెందిన కర్రి సాయి జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. కొంతమంది వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో అక్రమంగా చెరువులోతవ్వకాలు సాగిస్తున్నారన్నారు. పెద్ద పెద్ద గోతులు చేయడంతో ఆ గోతుల్లో నీరు చేరి ప్రమాదంగా మారిందన్నారు. రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో రాత్రివేళల్లో లారీలతో, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని, పలుమార్లు పట్టుకుని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. వెంటనే స్పందించి రైతులకు ఉపయోగకరమైన అచ్చెన్న చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మునగపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు జరగనున్నాయని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. 23న తోటాడ, నాగులాపల్లి-1, మునగపాక-1, పి.ఆనందపురం సచివాలయాల్లోను, 24న పాటిపల్లి, నాగులాపల్లి-2, మునగపాక-2, 25న టి.సిరసపల్లి-1, ఉమ్మలాడ, తిమ్మరాజుపేట, గంటవానిపాలెం, 26న టి.సిరసపల్లి-2, ఒంపోలు, అరబుపాలెం, చెర్లోపాలెం గ్రామాల్లో క్యాంపులు జరగనున్నాయని ఆమె తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయం ప్రారంభం

రాంబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్ చింతువా పంచాయతీ గజిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఎరిపల్లి వెంకటేశులు గ్రామ పెద్దల సహకారంతో ఆలయం నిర్మించారు. శుభముహూర్తాన వేదపండితు మంత్రోచ్చరణల నడుమ దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దలు ఎరిపల్లి భాస్కరరావు, చెల్లూరి కొండబాబు, చేపల శ్రీను, చేపల చిట్టిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మహోత్సవం

ఎలమంచిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సచివాలయ ఆవరణలో సోమవారం రాష్ట్రీయ పోషణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేలా అంగన్‌వాడీలు సేవలందించాలని కోరారు. అనంతరం రేగుపాలెం పీహెచ్‌సీ డాక్టర్. శ్రావణి, వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, తదితరులు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ఝాన్సీరాణి, కుమారి, సన్యాసమ్మ, పద్మ, సెక్రటరీ గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటవురట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కె వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్వస్థి నారీ స్వస్థక్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నవరంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మహిళలకు రక్తహీనత, నోటి, సర్వైకల్ క్యాన్సర్, బీపీ, షుగర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం రేపు

అచ్యుతాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున బుధవారం మండలంలోని 18 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్డు, సాయిప్రియ లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం, జంక్షన్, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు ఎస్‌టీబీఎల్ కాలనీ, అచ్యుతాపురంలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సత్యవరం వినోద్‌కాలనీకి చెందిన ముయ్యా రాజేష్(25) 8 నెలల క్రితం తన భార్యతో గొడవ పడడంతో ఆమె అలిగి కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 5వ తేదీన అతని భార్య ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజేశ్‌ని, అతని తల్లిని ప్రత్తిపాడు ఎస్‌ఐ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 9వ తేదీన తన భార్య, పిల్లలను ప్రత్తిపాడు నుంచి సత్యవరం తీసుకు వెళతానని రాజీ పడ్డాడు. ఇంటికి వచ్చిన తరువాత ఈనెల 6వ తేదీన అతను మనస్తాపంతో గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఏఎస్‌ఐ గోవిందరావు తెలిపారు.

కొలువు దీరిన దుర్గమ్మ

పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


వేమగిరిలో దుర్గాదేవి విగ్రహానికి నోట్ల దండలు వేసిన దృశ్యం

మునగపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మునగపాకలో పది చోట్ల మండపాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద ఎత్తున భవానీ మాలలు ధరించారు. మునగపాకలో పలు మండపాల్లో కొలువైన దుర్గామాతలను సోమవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. అదేవిధంగా తిమ్మరాజుపేటలో దుర్గామాతను ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, వాడ్రాపల్లిలో నవదుర్గామాతలను తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహానర్సింగరావు దర్శించుకున్నారు. ఆయా వేడుకల్లో బీవీ.రమణ, దొడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని దుర్గానగర్, బృందా వనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయంలోని కనకదుర్గ అమ్మవారు తొలిరోజు బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గెలుపు కోసం మొక్కుకున్న తెలుగు మహిళ నియోజక వర్గ అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి ఆధ్వర్యంలో దుర్గానగర్‌లో కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబు, రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లా విలియంకేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక దుర్గాలమ్మ చెట్టు ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కూటమి నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, ఆచంట దొర, కలిగట్ల శ్రీనివాసరావు, గొల్లపల్లి నాగు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురం/రూరల్‌లో..

మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూడిమడక బస్టాండ్ వద్ద దుర్గాదేవి, విఘ్నేశ్వరుడు, కుమార స్వామి, లక్ష్మీదేవి, సరస్వతి విగ్రహాలను మావుడూరి సంతోష్ కుమార్ శర్మ పూజలు చేసి ప్రతిష్ఠించారు. అలాగే మార్టూరు, అప్పన్నపాలెం, ఎంజగన్నాథపురం, అచ్యుతాపురం, సెజ్ పునరావాస కాలనీలలో కూడా విగ్రహ ప్రతిష్ఠలు జరిపారు. శరన్నవరాత్రులు ప్రారంభం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు భవానీ మాలధారణ చేశారు. అలాగే హరిపాలెం అందలాపల్లి భగీరథీ ఆలయం, చోడపల్లిలో గల చోడమాంబికా ఆలయం, నుపర్తిలో గల దుర్గాలయంలతో కూడా భారీ సంఖ్యలో భక్తులు భవానీ మాలధారణ చేశారు.

రాంబిల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దేవి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భవానీ భక్తులు దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. దిమిలి, కట్టుబోలు, మురకాడ నారాయణపురం పంచదార్ల, వాడపాలెం, గజిరెడ్డిపాలెం, రాంబిల్లి, కొత్తపట్నం, వాడనర్సాపురం, కొత్తపేట, కొప్పుగొండుపాలెం, పెదకలవలాపల్లి, వైలోవ, అప్పన్నపాలెం, సంతపాలెం తదితర గ్రామాల్లో వేలాది మంది భక్తులు మాలధారణ చేశారు.


పాయకరావుపేట దుర్గానగర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు చేస్తున్న ఎం.రమాకుమారి, మహిళలు


పాయకరావుపేట రూరల్: గుంటపల్లి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న గెడ్డం బుజ్జి, కన్నబాబు, ఆకాశ్, తదితరులు


అచ్యుతాపురం: పూడిమడకలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం

ఎలమంచిలిలో..

ఎలమంచిలి మునిసిపాలిటీతో పాటు మండలంలో సోమవారం దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మిలట్రీ కాలనీలో 43వ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్నారు. అదేవిధంగా దిమిలి రోడ్డులో ఆలయాన్ని తలపించేలా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలను ప్రారంభించారు. గాంధీనగర్, నాగేంద్రకాలనీ, పాతవీధి, కొక్కిరాపల్లి, పెదపల్లి, యర్రవరం తదితర వార్డులతో పాటు, ఏటికొప్పాక, పులపర్తి, పిఎస్‌ఆర్‌పేట, లైనుకొత్తూరు తదితర అన్ని గ్రామాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఎస్.రాయవరంలో..

మండలంలో సోమవారం దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారి కలశాలను ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. ఆలయాలు లేని గ్రామాల్లో మండపాలను ఏర్పాటుచేసి, దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారు తొలిరోజు బాల త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేమగిరి గ్రామంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని భక్తులు రూ. పది, ఇరవై నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తొమ్మిది అవతారాలకు చెందిన అమ్మవార్ల వేషాధారణలతో ఆకట్టుకున్నారు. ఎస్. రాయవరం, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గుంటపల్లి గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో ధర్మకర్త గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో సోమవారం దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం గెడ్డం బుజ్జి ఇంటి వద్ద నుంచి గెడ్డం కుటుంబీకులు, గ్రామస్థులు అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో నిలిపారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని గెడ్డం బుజ్జి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గెడ్డం కన్నబాబు, సర్పంచ్ గెడ్డం సుజాత, గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, పల్లి దుర్గారావు, సుంకర సూరిబాబు, గట్టెం కృష్ణ, కరెడ్ల దొరబాబు, తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని సత్యవరం, మంగవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, కుమారపురం, పెంటకోట, అరట్లకోట, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, రాజగోపాలపురం, ఎస్.నర్సాపురం, పాల్తేరులలో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఘనంగా బోనాల జాతర


ఎన్.నర్సాపురంలో బోనాల ఊరేగింపు .జరుగుతున్న దృశ్యం

నక్కపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్.నర్సాపురంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.. ఎన్.నర్సాపురం, ఉపమాక, మామిడివానిపాలెం గ్రామాలకు చెందిన భవానీదీక్షాపరులు చేసిన శరణుఘోష అలరించింది. గ్రామ వీధుల్లో అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. అనేక మంది మహిళలు బోనాలతో ఊరేగుతూ అమ్మవారికి సమర్పించారు. గురుభవానీ డీ రాంబాబు ముందుగా పూజలుచేసి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. ఎస్.నర్సాపురం గురుభవానీ మామిడి లోవరాజు, సర్పంచ్ పల్లా నాగరత్నం, గ్రామ పెద్దలు పల్లా చిన్నబ్బాయి, ఉప సర్పంచ్ మనబాల గంగరాజు, సారిపల్లి లోవరాజు, పల్లా రమణ పాల్గొన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నక్కపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక, మామిడివానిపాలెంల్లో నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఉపమాక వద్ద వున్న సంప్ నుంచి గ్రామంలో వున్న వీధి కొళాయిలకు మంచినీరు సరఫరా అయ్యేది. మోటారు మరమ్మతు కావడంతో నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. మహిళలు సోమవారం సాయంత్రం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు స్థానిక నాయకులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఈ విషయాన్ని సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి సోమవారం హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీవో డీ సీతారామరాజు మాట్లాడుతూ ఉపమాకలో వీధి కొళాయిలు మోటారు రిపేరు కారణంగా నిలిచిపోయినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. హోం మంత్రి ఆదేశాల మేరకు కొత్తమోటారును మంగళవారం అమర్చుతామని ఆయన చెప్పారు.


నీటిని వేరేచోట నుంచి తీసుకువెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

నీటి కోసం హాస్టల్ విద్యార్థినుల అవస్థలు

ఎలమంచిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాశాల వసతి గృహ విద్యార్థినులు సోమవారం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థినులు కొందరు ప్రధాన రోడ్డు దాటి తాగునీటి కొళాయిల వద్ద నుంచి బకెట్లతో నీటిని తీసుకెళ్లారు. ఆదివారం వీచిన భారీ ఈదురు గాలులకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మోటార్లు పనిచేయకపోవడంతో నీటి కోసం హాస్టల్ విద్యార్థినులు అవస్థలు పడ్డారు. కళాశాల వసతిగృహం ప్రాంతంలో త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యార్థినులు కోరారు.

చెట్ల నరికివేతపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

ఎలమంచిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకునే క్రమంలో వేసిన చెట్లను విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా తొలగిస్తున్న విధానంపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. మొక్కలు నాటిన తరువాత రెండు వైపులా విద్యుత్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నారని, ఈ క్రమంలో ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా ఓ పద్ధతిని అవలంబించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

పని గంటలు పెంపును వ్యతిరేకిస్తూ ఆందోళన

రాంబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మికుల పనిగంటలు పెంపును వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ అసెంబ్లీలో 8 గంటల పని విధానాన్ని కార్మికులతో 10 గంటలు పనిచేయించుకోవచ్చునన్నారు. కార్మికులను పరిశ్రమలకు కట్టుబానిసలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పని గంటలు పెంచినప్పుడు జీతభత్యాల కోసం మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, కార్మికులు అప్పారావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడైన మాంసంపై అధికారుల విచారణ

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరంలో నిల్వ, పాడైన మాంసం విక్రయంపై సోమవారం అధికారులు విచారణ నిర్వహించారు. గ్రామంలో ఆదివారం మేక మాంసం కొనుగోలు చేసిన కొంత మంది స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో గ్రామానికి చెందిన కోనే రామకృష్ణ, దేవవరపు మహేశ్, పోలీసులు, ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష, పశు వైద్యాధికారిణి శరణ్య, పోలీసులు విచారణ నిర్వహించారు. నిల్వ, పాడైన మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండారావు, వీఆర్‌ఓ రాజేశ్, గ్రామ పెద్దలు వంగలపూడి రామారావు, దేవవరపు రాజేశ్‌ఖన్నా, కోనే పుత్రయ్య, కోనే కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో


పెనుగొల్లులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు గ్రామంలో చేపట్టిన స్వామిత్వ సర్వేను సోమవారం ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. అలాగే పారిశుధ్య పనులతో పాటు ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు.

సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

» వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ

రాంబిల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ విమర్శించారు. సోమవారం సాయంత్రం ఆయన మండలంలోని పెదలవలాపల్లి, వైలోవ గ్రామాల్లో వైసీపీ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలను కూటమి పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిషోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, సర్పంచులు బద్ది నారాయణరావు, ఎలమంచిలి కనకారావు, నాయకులు మడగల శ్రీను, నేతల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

ఎలమంచిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలోని నెహ్రూనగర్ సచివాలయంలో చోరీకి పాల్పడిన ఎలమంచిలి అగ్నిమాపక కాలనీకి చెందిన ఎ.రాజశేఖర్‌ను అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ సావిత్రి తెలిపారు. అతను రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు, కీబోర్డు చోరీ చేసినట్టుదర్యాప్తులో తేలిందని, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు పంచాయతీ షాపుల వేలం

» 15 ఏళ్ల తర్వాత తొలిసారిగా బహిరంగంగా పాట


స్థానిక గౌతమ్ సెంటర్‌లో ఉన్న పంచాయతీ షాపులు

పాయకరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట పంచాయతీ దుకాణాలకు ఎట్టకేలకు అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. స్థానిక గౌతమ్ సెంటర్‌లో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఆరు షాపులు, వీటి పక్కనే మరో తొమ్మిది షాపులున్నాయి. వీటికి ప్రతి రెండేళ్లకొకసారి బహిరంగ వేలం నిర్వహించాలి. అయితే 15 ఏళ్ల నుంచి వేలం పాట నిర్వహించకుండా నామమాత్రపు అద్దెలు పెంచుతూ వస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కొద్దిరోజుల క్రితం ఈ షాపులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించి, లీజుదారులకు నోటీసులు జారీచేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో షాపుల వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో షాపుల బహిరంగ వేలంలో అద్దెలు ఏ మేరకు పెరుగుతాయో వేచిచూడాలి.

అనవసరంగా పురుగుల మందులు వాడొద్దు

» రైతులకు వ్యవసాయాధికారులు సూచన


రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయాధికారులు

అచ్యుతాపురం/రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనవసరంగా పురుగుల మందులు వాడొద్దని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి భవానీ అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి కొండకర్ల, తిమ్మరాజుపేట, హరిపాలెం, జగ్గన్నపేట పరిధిలోగల వ్యవసాయ భూములను పరిశీలించారు. వరిలో పొటాషియం లోపం నివారణకు 20 కిలోల మూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరానికి చల్లాలని సూచించారు. ఆకు ముడత తెగులు నివారణకు క్లోరోఫైరీఫాస్ 320 మిల్లీలీటర్ల, ప్రొఫెనోఫోస్ 400మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రాముల మందు 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో నీటిని తీసి వేసి బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అక్కడక్కడ పాముపొడ తెగులు కూడా ఉందని, నివారణకు కొనజోల్ 400 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కాగా మోతాదుకు మించి ఎరువులు వాడడం ద్వారా చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యసేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు, వ్యవసాయాధికారి శంకర్ గోవింద్ పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వర పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం పింఛన్లు, భూసమస్యలు, ఆక్రమణలపై ప్రజల నుంచి 28 అర్జీలు అందుకున్నారు. బ్రిటీష్ సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించి స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం, ఐద్వా ప్రతినిధులు అడిగర్ల రాజు, త్రిమూర్తులు రెడ్డి, ప్రభావతి, గౌరీ వినతి పత్రం అందజేశారు. మునిసిపాలిటీలో ఐదు రోడ్ల కూడలి, బ్రిటీష్ సమాధుల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం షాపులు తొలగించాలని కోరారు. ఏపీ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ, రాస్తారోకో చేసి ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో దాలెప్ప చెరువు గర్భం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని మడ్డు సత్యనారాయణ అర్జీ పెట్టుకున్నారు.

భక్తిశ్రద్ధలతో 126 అడుగుల లక్ష్మీగణపతి విగ్రహం నిమజ్జనం

▶▶ భారీగా తరలి వచ్చిన భక్తజనం


భారీ గణనాథుని విగ్రహం నిమజ్జనోత్సవ దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల లక్ష్మీగణపతి విగ్రహ నిమజ్జనం సోమవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగింది. తొలుత స్వామి వద్ద ఉంచిన లడ్డూకు వేలం నిర్వహించగా, ఓ భక్తుడు రూ.64 వేలకు పాడుకొని సొంతం చేసుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో నిమజ్జనానికి ముందు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు కమిటీ కన్వీనర్ బుద్ధ భూలోకనాయుడు ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తుల సమక్షంలో స్వామికి ప్రత్యేక హారతి ఇచ్చారు. అనంతరం అగ్నిమాపక శకటం ద్వారా అదే చోట గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. 22 రోజుల పాటు ఇక్కడ ఈ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు భారీగా భక్తజనం తరలి వచ్చారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణలు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అధిక లోడుతో వెళుతున్న వాహనాలకు జరిమానా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ సోమవారం పట్టుకొని రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వారు ఆ వాహనాలకు భారీగా జరిమానా విధించారన్నారు. జాతీయ రహదారిలోని విశాఖపట్నం మార్గం నుంచి అనకాపల్లి పూడిమడక రోడ్డు మార్గానికి అధిక లోడుతో వస్తున్న వాహనాలను తనిఖీ చేశామన్నారు. రెండు వాహనాలు అధికరాయి లోడుతో వెళ్తున్నట్టు గుర్తించి, అదుపులోకి తీసుకుని రవాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీంతో సదరు అధికారులు ఒక వాహనానికి రూ. 64 వేలు, మరో వాహనానికి రూ. 40వేలు జరిమానా విధించారని ఆయన వివరించారు.

ఎట్టకేలకు అనకాపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించింది. కమిటీ గౌరవ చైర్మన్‌గా కొణతాల రామకృష్ణ, చైర్మన్‌గా అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పచ్చికూర రామును ప్రకటించి చాలా కాలమైనప్పటికీ పూర్తిస్థాయిలో పాలకవర్గాన్ని నియమించలేదు. సోమవారం ఎట్టకేలకు పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పచ్చికూర రాము, వైస్ చైర్మన్‌గా కర్రి వెంకట సత్యనారాయణ, సభ్యులుగా సూరిశెట్టి రాముడు, కోట్ని లక్ష్మి, భర్నికాన రమణబాబు, కన్నూరు సరోజిని, సిరసపల్లి షణ్ముఖరాజు, ఎస్.వరలక్ష్మి, గోవాడ రాజు, మజ్జి రాజ్యలక్ష్మి, గంగుపాం వెంకటలక్ష్మి, ఎస్.గుణవతి, మళ్ల అమ్మాజీ, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, కాండ్రేగుల వెంకటజగ్గారావుతో పాటు సీహెచ్ఎన్ అగ్రహారం పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, విశాఖ నగర మేయర్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిని సభ్యులుగా నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తీసుకువచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేతో సంప్రదించి పాలకవర్గం ప్రమాణ స్వీకారం తేదీని ఖరారు చేయనున్నారని కూటమి వర్గాలు తెలిపాయి.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపండి : డీఆర్‌వో


పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తన దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు సూచించారు. ఓటరు జాబితా తయారీలో భాగంగా రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన మాసాంతపు సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తప్పులు లేని ఓటరు జాబితాలను తయారు చేసేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు తీర్మానంపై కార్మికుల ఆందోళన


జోనల్ కమిషనర్ చక్రవర్తికి వినతిపత్రం అందిస్తున్న ఆందోళనకారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించిన ఎనిమిది గంటల పనిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు రాత్రివేళ డ్యూటీలు వేయాలని తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం జోనల్ కమిషనర్ కె. చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, నాయకులు వీవీ శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్యబాబు, బొమ్మల రాము, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నిమ్మకాయల అజయ్, పొట్నూరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తుమ్మపాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్లిఖానుడుపాలెం సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.


పరవాడ బొంకుల దిబ్బవీధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం వద్ద వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, తదితరుల పూజలు


లంకెలపాలెం పరిధిలోని పెదముషిడివాడలో...


సబ్బవరం మండలం దేవీపురంలో యంత్ర మహామేరు వద్ద గోపూజతో ప్రారంభిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

కొలువుదీరిన కనకదుర్గమ్మ

▶▶ ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం ▶▶ ఆలయాల్లో, మండలాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనం


నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


గాయిత్రిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


కొత్తూరు కళాశాల వద్ద కొలువుదీరిన అమ్మ


దేవీపురంలో సహస్రాక్షి అమ్మవారు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. వీధివీధినా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదిమాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని వివిధ రూపాల్లో దుర్గమ్మ దర్శనమిచ్చారు. నూకాంబిక ఆలయ మండపంలో ఈ వేడుకలను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించి, ఉత్సవమూర్తికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, హోమాలు జరిపారు. కలెక్టర్‌ను ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. విరాళదాతలు దాడి ఆది శివ నూకరాజు, కాండ్రేగుల యోగ వినోద్‌కుమార్‌లు అన్నసమారాధన ప్రారంభించారు. ఆలయ మాజీ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. ఇక్కడి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో తొలిరోజు వేడుకల్లో గాయిత్రిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు. గౌరీ పంచాయతన ఆలయంలో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు. గవరపాలెం సతకంపట్టులో కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో తెల్లవారుజామున అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారిని స్వర్ణ కవచ దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొన్నాడ పెదబాబు, యండపల్లి బ్రహ్మాజీ, శ్రీనివాసరావు, సుందరయ్య, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీదేవిపేట, వేల్పుల వీధి రజక కాలనీ, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గల కనకదుర్గమ్మ ఆలయాల్లో కూడా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కొత్తూరు కాలేజీ కూడలిలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సత్యనారాయణపురం కళ్యాణ గిరిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తిని చైర్మన్ కోటిపల్లి వెంకటరమణ కిశోర్ ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వీరికి ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ స్వాగతం పలికారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండల వ్యాప్తంగా సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పరవాడ బొంకుల దిబ్బయాత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పైలా అప్పారావు, నీలిమా దంపతులు తొలి పూజ నిర్వహించారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, చల్లా కనకారావు, బొంకుల దిబ్బయాత్ అసోసియేషన్ ప్రతినిధులు పైలా పైడంనాయుడు, చీపురుపల్లి శ్రీనివాసరావు, పైలా హరీష్, పైలా వెంకటరావు పాల్గొన్నారు. యంగ్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవి విగ్రహం వద్ద మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, లక్ష్మీ దంపతులు తొలి పూజ జరిపారు. తానాంలో ఆదర్శ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం వద్ద సర్పంచ్ కన్నూరుదేవి, వెంకటరమణ దంపతులతో పాటు మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు తొలి పూజ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, స్థానిక నాయకులు రొంగలి గోపాలకృష్ణ, వర్రి వసంతరావు, పైలా రామారావు, పైలా చంద్ర, వర్రి వెంకటరమణ, రొంగలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. వెన్నెలపాలెంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు తొలి పూజ నిర్వహించారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి లంకెలపాలెం పరిసర గ్రామాలతో పాటు పెదముషిడివాడ, సాలాపువానిపాలెం, మంత్రిపాలెం, కూన్నూరు ప్రాంతాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో దుర్గానవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. పెదముషిడివాడలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. లంకెలపాలెం కూడలిలో మరిడిమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సబ్బవరం, నంగినారపాడు, జోడుగుళ్ల, గుల్లేపల్లి, పైడివాడ తదితర గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. దేవీపురంలో గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో గోపూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 28 కలశాలను స్థాపించారు. షోడశోపచార అష్టోత్తర పూజలు, లలితా సహస్రనామ పారాయణం, చండీ పారాయణం, దక్షిణ కాళీ హోమం జరిపారు. శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచండి

▶▶ తుమ్మపాల పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో రైతులు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి సత్యనారాయణ

తుమ్మపాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పీఏసీఎస్‌లో తమకు అన్ని వేళలా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తుమ్మపాల రైతులు కోరారు. పీఏసీఎస్ కార్యాలయ భవనంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రైతు సంఘం నాయకులు బొడ్డపాటి చిన రాజారావు, పీలా బుజ్జి మాట్లాడుతూ రైతుల షేర్ ధనంపై పది శాతం డివిడెంట్ ఇవ్వాలని, ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా రైతులకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల డిమాండ్లను నెరవేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతోనే పీఏసీఎస్ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సభ్యుల కోరిక మేరకు మృతి చెందిన సభ్యుల దహన ఖర్చుల నిమిత్తం కుటుంబానికి ఎనిమిది వేల రూపాయలు అందిస్తున్నట్టు వివరించారు. సభ్యులకు కావలసిన ఎరువులను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు చదరం ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దేమునిగుమ్మం శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. 52 రోజులకు భక్తుల కానుకల రూపంలో రూ.3,58,975 నగదు లభించిందని ఈవో బి.మురళీకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వెండి నాలుగు కిలోల 580 గ్రాములు, బంగారం తొమ్మిది గ్రాములు, యూఎస్ఏ 20 డాలర్ ఒక నోటు భక్తులు సమర్పించినట్టు వివరించారు.

డిమాండ్లపై డీఎంహెచ్‌వోకు పీహెచ్‌సీ వైద్యుల వినతి

▶▶ పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిక


డీఎం హెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ తరఫున సోమవారం ఇక్కడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం. హైమావతిని కలిశారు. ఈ మేరకు డిమాండ్లతో పాటు సమ్మెపై ఆమెకు వినతి పత్రం అందజేశారు. ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసే వారికి బేసిక్‌పై యాభై శాతం ట్రైబల్ అలవెన్సు మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.ఐదు వేలు అలవెన్సు ఇవ్వాలని, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలు పరిష్కరించాలని, వైద్యులకు ఖచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలన్న డిమాండ్లను ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే గురువారం కార్యాచరణ ప్రకటించి, నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : పీలా


కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న గోవింద్

కశింకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. నర్సింగబిల్లిలో ఆదివారం రాత్రి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త సత్యారావు ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ నుంచి మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును అందజేశారు. అలాగే గ్రామంలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి ద్వారానే విద్యార్థులకు మెరుగైన అవకాశాలు


మైఖేల్ చిత్రపటం వద్ద అధ్యాపక బృందం నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శాస్త్రవేత్త, విద్యుత్, మాగ్నెటిజం రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మైఖేల్ ఫరాడే జయంతిని ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంకేతిక పరిశోధనల సమాహారంగా రూపొందించిన ఇన్నోవేటివ్ ఐడియాస్-2కె 25 పుస్తకాన్ని, క్వాంటమ్ స్పార్క్స్ పుస్తకాన్ని ఏపీ మెడ్టెక్ జోన్ సైంటిస్ట్ నరేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ద్వారానే విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందగలరన్నారు. అనంతరం సాంకేతికత పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

24న 'చలో విశాఖ డెయిరీ'

కశింకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని పాడి రైతులంతా విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు కర్రి అప్పారావు, సీఐటీయూసీ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని బయ్యవరం, తేగాడ, గంటవానిపాలెం, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, తాళ్లపాలెం, పల్లపు సోమవరం, ఏఎస్‌పేట, అనకాపల్లి మండలం పిసినికాడ తదితర గ్రామాల్లో రైతులను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాడి రైతుల కృషి వల్ల విశాఖ డెయిరీ ఇప్పటి వరకు అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. ఇటీవల పాలకవర్గంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని ఆరోపించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


నెహ్రూచౌక్‌లో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కొత్తూరు/కశింకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు అనకాపల్లి పట్టణంలోని నెహ్రూచౌక్ కూడలిలో సోమవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు హాజరై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే, కశింకోట మండలం తాళ్లపాలెంలో మోదీ, నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బీజేపీ నాయకుడు పొన్నగంటి అప్పారావు పాలాభిషేకం చేశారు. కశింకోటలో కూడా సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన ఆలయంలో కళావేదిక ప్రారంభం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానం ఆవరణలో గౌరీ సేవా సంఘం నూతనంగా నిర్మించిన కర్రి రమేష్ కళా వేదికను వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళావేదిక నిర్మాణ దాత కర్రి సన్యాసినాయుడును పెదబాబు, ఆలయ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం దంపతులతో సత్యనారాయణ స్వామి వ్రతాలను చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం'


అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో లలితకుమారి

సబ్బవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వి.లలితకుమారి అన్నారు. మొగలిపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. మూడేళ్ల పిల్లలకు ప్రేరణ, అభివృద్ధి, పోషణతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

తుమ్మపాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి వాణి జగదీశ్వరి అన్నారు. ఇందులో భాగంగా సోమవారం తుమ్మపాలలో మహిళలు, పిల్లలకు ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. రక్త పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం స్థానికులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వాణిజగదీశ్వరి మాట్లాడుతూ ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాడేరులో ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక శిబిరం

పాడేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఆధార్ కార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తారని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో నెలకొన్న తప్పొప్పులు, మార్పులు, చేర్పులు వంటివి చేసుకునేందుకు ప్రత్యేక శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24,25 తేదీల్లో చింతపల్లిలో సర్పంచులకు శిక్షణ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చింతపల్లి, జీకేవీధి మండలాల సర్పంచులు, కార్యదర్శిలకు ఈనెల 24, 25 తేదీల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు మండలాల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తామన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ పశువైద్యాధికారి కె.సురేష్ కోరారు. సోమవారం డోకులూరులో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ కొర్రబోయిన సన్నిబాబు ప్రారంభించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో 350 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందించామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కె.కోటిబాబు, కె.ఉమ, మనోజ్, బాలన్న, ఆనంద్, కొండబాబు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'


డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చీకటి నాగేశ్వరరావు సోమవారం డీఈవో పి.బ్రహ్మజీరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల యాంటిసీడెంట్ వెరిఫికేషన్, సర్వీస్ రెగ్యులైజేషన్, 10వ తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షల ఇన్విజిలేషన్ రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. అందుకు డీఈవో సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

21,231 పశువులకు 'గాలికుంటు' నిరోధక టీకాలు

చింతపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్‌లో 21,231 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం అంతర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్నిన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారించేందుకు అక్టోబరు 15 వరకు టీకాలు వేస్తామన్నారు. ఇప్పటి వరకు చింతపల్లిలో 7,754, జీకేవీధి 5,593, కొయ్యూరు 7,884 పశువులకు టీకాలు వేశామన్నారు. అలాగే ప్రతి గురువారం పశువైద్యశాలల్లో కొక్కిరి తెగులు నివారణకు కోళ్లకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కోళ్ల పెంపకందారులు కచ్చితంగా టీకాలు వేయించాలన్నారు.కార్యక్రమంలో ఎల్ఎస్ఏ నాగరాజు, ఏహెచ్ఏ కృష్ణ, కూటమి నాయకుడు గాంధీపడాల్ పాల్గొన్నారు.

అధ్వానంగా చింతలవీధి రహదారి

▸▸ అవస్థలు పడుతున్న ప్రజలు, వర్తకులు


చింతలవీధి జంక్షన్ వద్ద నివాస గృహాల్లోకి చేరుతున్న వరద నీరు

పాడేరురూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామంలో మురుగు కాలువల వ్యవస్థ అధ్వానంగా మారిందని చింతవీధి మూడు రోడ్ల జంక్షన్ ప్రజలు, దుకాణాల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. హైవే నిర్మాణం చేపట్టడంతో పాడేరు నుంచి పెదబయలు వెళ్లే రహదారి చింతలవీధి జంక్షన్ వద్ద లోతట్టు ప్రాంతంగా మారింది. దీంతో గ్రామంలో ఉన్న మురుగు కాలువలు మూతపడాయి. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీరు, బురద నీరు నివాస గృహాల్లోకి, షాపుల్లోకి వచ్చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆది, సోమవారాల్లో భారీగా వర్షంతో వర్షపు నీరు ఇళ్ల, షాపుల్లోకి వచ్చి చేరడంతో తీవ్ర అవస్థలు పడ్డామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువల వ్యవస్థను పునరుద్ధరించి తమను ఆదుకోవాలని ఆ ప్రాంత ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

169 మందికి కంటి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 22, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లబ్బూరు, రూఢకోట పీహెచ్‌సీలలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 169 మందికి ఈ పరీక్షలు జరిపారు. వైద్యాధికారి సత్యారావు, ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కండీషన్‌లో ఉన్న బస్సులనే నడపండి

▸▸ ఆర్టీసీ అధికారులకు సంస్థ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర సూచన

▸▸ మధురవాడ డిపోకు చెందిన జోలాపుట్టు నైట్‌హాల్ట్ బస్సు మొరాయించడంపై స్పందన


దొన్నుదొర

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగే విధంగా చూడాలని, కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సంస్థ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర సూచించారు. విశాఖ మధురవాడ ఆర్టీసీ డిపోకు చెందిన జోలాపుట్టు నైట్‌హాల్ట్ బస్సు తరచూ మొరాయిస్తుండ డంతో పాటు ఆదివారం ఉదయం జోలాపుట్టు నుంచి మధురవాడకు తిరుగు ప్రయాణంలో మార్గ మధ్యలో గల మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్‌లో పాడైన విషయం తెలిసిందే. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం పత్రికల్లో ప్రచురితం కావడంతో దొన్నుదొర స్పందించారు. సోమవారం మధురవాడ ఆర్టీసీ డీఎంతో మాట్లాడి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని, డిపోల నుంచి బస్సులు బయటకు వెళ్లే ముందు ఒకటికి రెండు సార్లు పరీక్షించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. దీనిపై ఆర్టీసీ మధురవాడ డిపో మేనేజర్ కనకదుర్గ మాట్లాడుతూ జోలాపుట్టు నైట్ హాల్ట్ బస్సు మార్గ మధ్యలో ఆదివారం మొరాయించిన విషయం తన దృష్టికి వచ్చినట్టు జోన్ చైర్మన్ దొన్నుదొరకు వివరించారు. ఇకపై అటువంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బస్సులో ఎలక్ట్రికల్ సమస్య తలెత్తిన కారణం గానే మధ్యలో ఆగిపోయిందని, పాడేరు డిపో నుంచి మెకానిక్‌ను తీసుకువచ్చి మరమ్మతులు చేయించామని తెలిపారు. ఆ బస్సు స్థానంలో మరో బస్సును నడుపుతామన్నారు.

ఘనంగా దేవి శరన్నవరాత్రులు ప్రారంభం


పాడేరు కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు


చింతపలిల: అంతర్ల శివాలయంలో అమ్మవార్ల విగ్రహాలను తీసుకువస్తున్న హెచ్‌డబ్ల్యూవో వినాయకరావు దంపతులు

పాడేరురూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాడేరులో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో కమిటీ గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు, అధ్యక్షులు రొబ్బి రాము, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి, వర్తన వరలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ప్రత్యేక అతిథులుగా వచ్చిన ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్, మాజీ ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, డాక్టర్.నర్సింగరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, సీఐ డి.దీనబందులను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. శరన్నవరాత్రులు సందర్భంగా వందలాది భక్తులు సోమవారం ఉమానీలకంఠేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, మోదకొండమ్మను దర్శించుకున్నారు.మోదకొండమ్మ, కనకదుర్గమ్మ ఆలయాల్లో మందలాది మంది భక్తులు భవానీ మాలలను దరించారు.

చింతపల్లిలో..

మండలంలో దుర్గాదేవి మండపాల్లో విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. అంతర్ల, బౌడ శివాలయాల్లో శరన్నవరాత్రులు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం చింతపల్లి రంగా సెంటర్‌లో దుర్గాదేవి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతర్ల శివాలయంలో హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు దంపతులతో ప్రత్యేక పూజలు చేశారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరులో సోమవారం నుంచి 36వ దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఏపీ జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. బాలాజీ రెసిడెన్సీ యాజమాని నక్కా బాల దంపతులు అమ్మవారికి 9 రకాల నైవేద్యం సమర్పించారు. చదరం సుబ్రహ్మణ్యం కుమారులు అమ్మవారికి పట్టుచీర, వివిధ రకాల పూలు, పండ్లు సమర్పించారు. ఈసందర్భంగా డప్పు వాయిద్యాలతో ముత్తైదువులను దేవీ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా సీలేరు మార్కెట్ సెంటర్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దసరా ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్



పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు (దసరా) ఉత్సవాలను నిర్వహించే కమిటీలు పోలీసుల నుంచి ముందస్తు అనుమ తులు తీసుకోవాలని ఎస్పీ అమిత్ బర్దార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా మండపాలు, పందిళ్ళు ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరన్నారు. విగ్రహాల వద్ద తాత్కాలిక సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద డీజేలు, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టంలను ఏర్పాటు చేయకూడదని, మైక్ పర్మిషన్ కోసం ఎస్‌డీపీవో నుంచి అనుమతి తీసుకోవాలని, రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదన్నారు. అశ్లీల నృత్యాలు అనుమతించబడవన్నారు. హుండీలు, ఆభరణాలు, ప్రసాదం మొదలైన వాటికి పూర్తిగా కమిటీ బాధ్యత వహించాలన్నారు. ప్రజలెవరికీ అసౌకర్యం లేకుండా నిర్వాహకులు ముందుగానే చూసుకోవాలన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించాలి

▸▸ అధికారులకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం


కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిత్తడి నేలలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చిత్తడి నేలల పరిరక్షణపై కలెక్టరేట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చిత్తడి నేలలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వెట్ ల్యాండ్ రూల్స్- 2017 ప్రకారం అధికారులు చిత్తడి నేలల గుర్తింపు, సరిహద్దుల నోటిఫికేషన్ వంటివి విధిగా చేయాలన్నారు. అలాగే ఇప్పటికే రంపచోడవరం డివిజన్ పరిధిలో 71 చిత్తడి నేలల గుర్తింపు జరిగిందని, మిగిలిన ప్రాంతాల్లో వేగంగా గుర్తించాలన్నారు. అలాగే ఆయా భూముల్లో తాగునీరు, ఎకో కల్చర్, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, సాగు వంటి పరిస్థితులను గుర్తించాలన్నారు. అలాగే చిత్తడి నేతల గుర్తింపుపై సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్, డీఎఫ్‌వో రవీంద్రదామా, సర్వే విభాగం ఏడీ దేవేంద్రుడు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి విజయరామ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో మ్యూజియం పనులు పూర్తి చేయాలి : ఐటీడీఏ పీవో శ్రీపూజ


మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

చింతపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలను మూడు నెలల్లో పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాలను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 60శాతం నిర్మాణాలను పూర్తి చేశామని గిరిజన సంక్షేమశాఖ ఈఈ జి. డేవిడ్‌రాజు తెలిపారు. వర్షాల కారణంగా పనులు కొంత అంతరాయం కలుగుతుందన్నారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ మ్యూజియం నిర్మాణాలను డిసెంబరు నెలాఖరునాటికి పూర్తి చేయాలన్నారు. లంబసింగి పంచాయతీ చిట్టంగరు మల్టీపర్పస్ భవనం నిర్మాణాలను ఆమె తనిఖీ చేశారు. పక్కనే ఉన్న మినీ అంగన్‌వాడీని సందర్శించి బాలబాలికలతో ముచ్చటించారు. అంగన్‌వాడీ రికార్డులను ఆమె తనిఖీ చేశారు. లంబసింగిలో ఉన్న ఐటీడీఏ అతిథి గృహాన్ని పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చింతపల్లి ఏకో పల్పింగ్ యూనిట్‌ని సందర్శించారు. కాఫీ రైతులు గత ఏడాది పండ్లు కిలోకి తొలివిడతగా రూ.44, బోనస్ రూ.ఎనిమిది చెల్లించారని, అదనపు బోనస్ చెల్లించాలని పీవోని కోరారు. మ్యాక్స్ నిర్వహణపై మరోసారి సమీక్షించి అదనపు బోనస్ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, క్యూరేటర్ శంకరరావు, ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె. సన్నిరాంబాబు, టీడబ్ల్యూ ఏఈఈ యాదకిశోర్, మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు, డైరెక్టర్ అడపా విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఏజెన్సీలో సహజ వనరులు కొల్లగొట్టేందుకు కుట్ర

▸▸ జీపు జాతాను ప్రారంభించిన సీపీఎం నేత లోకనాథం


బూసుకొండ సభలో మాట్లాడుతున్న లోకనాథం

సీలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ మన్యంలో ఉన్న సహజ వనరులను కొల్లగొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. సోమవారం దుప్పలవాడ పంచాయతీ బూసికొండలో ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని కోరుతూ జరిగిన ఆదివాసీ అరణ్య గర్జన సభలో ఆయన మాట్లాడారు. దాదాపు 9 వేల మెగావాట్ల ప్రాజెక్టులు రాబోతున్నాయని, దీని కోసం 10 వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూములను ప్రభుత్వాలు కేటాయించాయన్నారు. గిరిజనుల మనుగడకు తీవ్ర నష్టాన్ని తెచ్చే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును, హైడ్రో పవర్ ప్రాజెక్టులను స్వాగతించాలా- వ్యతిరేకించాలా.. మీరే నిర్ణయించుకోవాలన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేలు గానీ, ఎంపీలు గానీ ఎందుకు వీటిని వ్యతిరేకించడానికి ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు తొమ్మిది మండలాల్లోని వందలాది గ్రామాల్లో పర్యటించి, ఈనెల 27వ తేదీన 10 వేల మందితో హుకుంపేట మండలం బూర్జా పంచాయతీ మజ్జివలసలో ఆదివాసీ అరణ్య గర్జన సభ నిర్వహిస్తామన్నారు. దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్క్‌రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి బి చన్నయ్యపడాల్, సీలేరు పంప్డ్ స్టోరేజీ నిర్వాసితుల కమిటీ అధ్యక్షుడు ప్రభాస్, మాజీసర్పంచ్ కె.త్రినాథ్, బీఎల్ఎం ఇన్‌చార్జి రాజన్న, దుప్పులవాడ మాజీసర్పంచ్ అల్లంకి రాజు, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు ప్రసంగించారు.

అనంతరం సీపీఎం నేతలు లోకనాథం, అప్పలనర్స జెండా ఊపి జీపు జాతాను ప్రారంభించారు. అనంతరం సీలేరు వరకు నిర్వాసితులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండకారణ్య విమోచనా సమితి జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, మోతుగూడెం సీసీఎం నాయకుడు చింతా రాంబాబు, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

'మహిళలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి'


ఎమ్మెల్యే మత్స్యలింగం, జడ్పీటీసీ, ఆసుపత్రి సిబ్బంది ప్రతిజ్ఞ

అరకులోయ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని దేశంలో ఉన్న మహిళలందరికీ ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మహిళలంతా ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అరకులోయ ఆసుపత్రిలో సోమవారం ఆయన జడ్పీటీసీ రోష్నీతో కలిసి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు కార్డులు పంపిణీ, గర్భిణులకు పరీక్షలు, టీకాలు వేయడం, రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించడం,రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు జరుపుతారన్నారు. జడ్పీటీసీ శెట్టి రోష్నీ మాట్లాడుతూ మహిళలంతా ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాము మాట్లాడుతూ వచ్చే నెల రెండో తేదీ వరకు అన్ని పీహెచ్‌సీల్లోను, ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వైసీపీ మండల అధ్యక్షుడు రామ్మూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ర్యాలీ


అనంతగిరిలో ర్యాలీ చేపడుతున్న గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అడవి జోలికి వస్తే తరిమికొడతామంటూ గిరిజనులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండల కేంద్రం అనంత గిరిలో సోమవారం గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నిర్వహించిన ర్యాలీకి వేంగడ, పైనంపాడు, వాలసీ, పెదబిడ్డ, పెదకోట, గుమ్మకోట, టోకూరు పంచాయతీల్లోని పలు గ్రామాల గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జడ్పీటీసీ గంగరాజు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ రేగుళ్లపాలెం, గుజ్జెలి, చిట్టంవలస, మీగత హైడ్రో ప్రాజెక్టుల కారణంగా 20 పంచాయతీల్లోని 200 గ్రామాల గిరిజనులు ముప్పునకు గురవుతున్నారని, గిరిజనులను జల సమాధి చేస్తారా.. అంటూ మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం సరిహద్దు దిమ్మలను ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని, అనుమతులు రద్దుచేయాలని కోరారు. గ్రామసభలు లేకుండా గిరిజనుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రాజెక్టులకు అనుకూలంగా జీవోను ఇవ్వడం ఆదివాసీ మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. 5వ షెడ్యూల్‌లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, కార్పొరేట్ కంపెనీలు వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోని సర్పంచులు రూతు, మొస్య, రమేశ్, చినబాబు, సీపీఎం నాయకులు రామరావు, మజ్జి కృషంరాజు, సురేశ్ కుమార్, మాజీ సర్పంచులు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి


పాడేరులో ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందంటూ బీజేపీ నాయకులు సోమవారం అంబేడ్కర్ కూడలిలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడం వల్ల అన్ని వర్గాల ప్రజలు లాభపడతారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం వల్ల సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.కృష్ణారావు, పి.రవికుమార్, వెంకటరమణ, టి.సత్యవతి, ఎం.గోపాలపాత్రుడు, మత్స్యకొండబాబు, జి.కొండబాబు, పి.కృష్ణ, కెజియారాణి, వరలక్ష్మి, ఆనంద్, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎకరాకు 4,220 కిలోల మొక్కజొన్న దిగుబడి


మొక్కజొన్న దిగుబడిని అంచనా వేస్తున్న డేవిడ్‌రాజు

చింతపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంట ఎకరాకు 4,220 కిలోల దిగుబడి వచ్చిందని విశాఖపట్నం ఎస్ఎస్‌వో సీనియర్ స్టాటికల్ అధికారి ఎన్. డేవిడ్‌రాజు అన్నారు. సోమవారం చౌడుపల్లి పంచాయతీలో వ్యవసాయ అధికారి టి. మధుసుదనరావు ఆధ్వర్యంలో సీనియర్ స్టాటికల్ అధికారి మొక్కజొన్న పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించి దిగుబడులను అంచనా వేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ మొక్కజొన్న దిగుబడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రాంబాబు, ఎస్‌బీఐ ఇన్సూరెన్సు సూపర్‌వైజర్ ఆర్.శివ, వీఏహెచ్ శోభన్‌బాబు, రైతు వెంకటరమణ పాల్గొన్నారు.

30లోగా ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌ను రెన్యువల్ చేసుకోవాలి

పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) పోర్టల్‌లో రెన్యువల్ కోసం నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మజీరావు, అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2004 డిసెంబరు 8వ తేదీన ఎన్ఎంఎంఎస్‌లో ఎంపికైన విద్యార్థులతో పాటు 2021, 2022, 2023 సంవత్సరంలో ఎంపికైన ఎన్ఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియకు జిల్లా నోడల్ ఆఫీసర్ 9490270788 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా రెన్యువల్ చేసుకోని విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ మంజూరు కాదని స్పష్టం చేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ఉద్యోగులు



పాడేరులో ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

పాడేరురూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాడేరు సర్కిల్ విద్యుత్ ఉద్యోగులు సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పాడేరు సర్కిల్ కార్యాలయం వద్ద రెండు రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఉద్యోగులు సోమవారం సర్కిల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నినాదాలు చేశారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరులో జెన్‌కో ఉద్యోగులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ సెంట్రల్ జేఏసీ పిలుపు మేరకు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి భోజన విరామ సమయంలో జెన్‌కో ఉద్యోగులు స్థానిక జెన్‌కో కార్యాలయం నుంచి సీలేరు పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వై.సత్తిబాబు, వై.దాద్రాజు, కే భవాని శంకర్, ఎస్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పెదబయలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు మండల కేంద్రం పెదబయలులో సోమవారం ప్రారంభమయ్యాయి. దేవీ మోద హరిహరపుత్ర మోటారు యూనియన్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల అధ్యక్షుడు సమరెడ్డి పూర్ణయ్య, ప్రధాన కార్యదర్శి గండేరు జీవన్‌కుమార్, కోశాధికారి సర్వసిద్ధి రామరావుతో కలిసి అంతా పూజలు నిర్వహించారు. ఎస్ఐ కొల్లి రమణ, నాయకులు కొంట సూర్యనారాయణ, పాంగి సింహాచలం, మోటారు యూనియన్ నాయకులు కిశోర్, అంజిబాబు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కిండలం పాఠశాల విద్యార్థులకు నీటి కష్టాలు


అసంపూర్తిగా ఉన్న బోరును పరిశీలిస్తున్న సంఘం నాయకులు

పెదబయలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో గల పాఠశాల వద్ద అసంపూర్తిగా ఉన్న బోరు పనులను పూర్తిచేసి విద్యార్థులు తాగునీటిని అందించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామాన్ని వారు సందర్శించి సదరు బోరును పరిశీలించారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా రెండేళ్ల క్రితం బోరు వేసినప్పటికీ హెడ్ బిగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని జీఎస్‌యూ నాయకుడు బాబూజీ ఆరోపించారు. దీంతో ఇక్కడి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో గల విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత్యంతరం లేక ఆయా విద్యాలయాల్లో వంట కోసం సమీపంలో గల పంట పొలాల నుంచి బురద నీటి తెస్తున్నారన్నారు. దీని వల్ల విద్యార్థులకు అనారోగ్య సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న బోరు పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని కాపాడండి

- చెరకు రైతుల బకాయిలు చెల్లించండి
- సచివాలయాల్లో వినతిపత్రాలు అందించిన రైతులు, రైతు సంఘాల నేతలు



గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని కోరుతూ గోవాడ సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న రైతులు

చోడవరం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ కొనసాగించడంతో పాటు, చెరకు రైతులు కార్మికుల బకాయిలు చెల్లించాలని కోరుతూ, సోమవారం గోవాడ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి పిలుపుమేరకు పలు గ్రామాల్లో స్థానిక రైతులు సచివాలయాల్లో వినతిపత్రాలు అందించారు. మండలంలోని గోవాడ సచివాలయంలో ఏడువాక శ్రీనివాసరావు, హరి, అట్టా నాయుడు, ఏడువాక గంగరాజు తదితరులు సచివాలయంలో వీ ఆర్వోకు వినతిపత్రం అందించారు.

'గోవాడ దుస్థితికి కారణం ఎంపీ సీఎం రమేశ్'

చోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ దుస్థితికి ప్రధానంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు బాధ్యులని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. సహకార రంగంలో అగ్రగామిగా ఉన్న గోవాడను ఆదుకుంటామని, ప్రగతిపథంలో నడిపిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎంపీ సీఎం రమేశ్, గెలిచిన తరువాత గోవాడ గురించి కనీసం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీ విషయంలో రైతులకు హామీలు ఇచ్చిన చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కూడా ప్రస్తుతం గోవాడ గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ఆర్డీవో రమణకు సమస్యలు వివరిస్తున్న సీపీఎం నేతలు

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వర పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం పింఛన్లు, భూసమస్యలు, ఆక్రమణలపై ప్రజల నుంచి 28 అర్జీలు అందుకున్నారు. బ్రిటీష్ సమాధుల స్థలంలో ఆక్రమణలు తొలగించి స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం, ఐద్వా ప్రతినిధులు అడిగర్ల రాజు, త్రిమూర్తులు రెడ్డి, ప్రభావతి, గౌరీ వినతి పత్రం అందజేశారు. మునిసిపాలిటీలో ఐదు రోడ్ల కూడలి, బ్రిటీష్ సమాధుల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం షాపులు తొలగించాలని కోరారు. ఏపీ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ, రాస్తారోకో చేసి ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో దాలెప్ప చెరువు గర్భం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని మద్దు సత్యనారాయణ అర్జీ పెట్టుకున్నారు.

స్వస్థ్ నారీ ప్రత్యేక వైద్య శిబిరాలు



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

రావికమతం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం రావికమతం పీహెచ్‌సీ పరిధిలో తోటకూరపాలెం, కొత్తకోట పిహెచ్‌సీ పరిధిలో కొత్తకోట గ్రామ సచివాలయం-2 వద్ద వైద్యాధికారులు శ్రీనివాస్ సురేఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం వీరంతా ప్రతిజ్ఞ చేశారు. తోటకూరపాలెంలో హెచ్ఎస్ హేమసుందరావు,వైద్య సిబ్బంది పాల్గొనగా, కొత్తకోటలో ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో సోమవారం స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్. గాయత్రి, జ్యోతి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, ఉపసర్పంచ్ సహదేముడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో..

నాతవరం: స్థానిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నకుమార్, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు సోమవారం క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 112 మందికి వైద్య పరీక్షలు చేయగా, ఆరుగురు మహిళలను అనుమానితులుగా గుర్తించి విశాఖ కేజీహెచ్‌కి వెళ్లాలని సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు, ఉపసర్పంచ్ ఈర్లె చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వై అగ్రహారం గ్రామంలో...

కె.కోటపాడు: మండలంలోని ఆర్ వై అగ్రహారం గ్రామంలో సచివాలయం కేంద్రం ఆవరణలో సోమవారం మహిళా ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ఉపసర్పంచ్ లెక్కల అచ్చుబాబు ప్రారంభించారు. లంకవానిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శైలజా సురేశ్‌కుమార్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగవేణి, ప్రమీలా , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ షెడ్యూల్డ్ ఏరియాపై అసెంబ్లీలో చర్చ

- ఎమ్మెల్యే బండారు ప్రస్తావించడంపై గిరిజనుల ఆనందం

దేవరాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజనులను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని అసెంబ్లీ సమావేశాల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రస్తావించడం పట్ల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకే కులం, ఒకే తెగ, ఒకే ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఏరియాలుగా విభజించడం వలన మైదాన ప్రాంత గిరిజనులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందడం లేదని, కూటమి ప్రభుత్వం స్పందించి మైదాన ప్రాంత గిరిజనులను షెడ్యూల్డ్ గిరిజనులుగా గుర్తించాలని బండారు సత్యనారాయణమూర్తి కోరారు. దీనిపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు, సంబంధిత శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందించారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదలైంది.

ఘనంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం

- వివిధ రూపాల్లో దుర్గాదేవి అలంకరణ
- మండపాల్లో ప్రతిమల ఏర్పాటు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



నర్సీపట్నంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం, బలిఘట్టంలోని దుర్గామల్లేశ్వర ఆలయాలతో పాటు, వీధులలో కూడా దుర్గమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బలిఘట్టం ఉత్తరవాహినికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో పట్టణ పోలీసులు క్రమబద్ధీకరించారు. నర్సీపట్నం దుర్గామల్లేశ్వర ఆలయంలో 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కలశ స్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకవర్గం చైర్మన్ జంపా నాగేంద్రరాజు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల: స్థానిక దేవి ఆలయంలో గల దుర్గమ్మ అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. స్థానిక జీసీసీ గోదాము దగ్గర దుర్గాలమ్మ ఆలయంలో దుర్గమ్మకు, నవరవీధిలో గల ఆలయంలో శ్రీబాలా తిపుర సుందరి దేవి అవతారంలో ఉన్న శ్రీ పోలిపిలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి సూర్యారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నాతవరంలో...



నాతవరం: స్థానిక శ్రీశక్తి పంచాయతన ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గ ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త శెట్టి సతీశ్ భవానీ మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రావికమతంలో..

రావికమతం: మండలంలోని చినపాచిలలో గ్రామస్థులు భారీ ఊరేగింపుగా అమ్మవారి ప్రతిమను గ్రామంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పెద్ద ఎత్తున సారె సమర్పించారు. కొత్తకోటలో అమ్మవారి విగ్రహంతో పాటు అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో ఊరేగింపు నిర్వహించారు. టి.అర్జాపురం, రావికమతం, మేడివాడ, కొత్తపట్నం, మర్రివలస, తట్టబంద, గుడ్డిప, తోటకూరపాలెం, తదితర గ్రామాల్లో కూడా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

బాలా త్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గామాత



పసుపు కొమ్ములతో బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో దుర్గాదేవి

చోడవరం: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత సోమవారం బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ఆలయంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి లఘు సంప్రోక్షణ, మండప ఆరాధన, అనంతరం సూక్త సహిత సహస్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సహస్ర పసుపు కొమ్ములతో పూజ చేశారు. పలువురు భక్తులు భవానీ మాలధారణ చేయడంతో ఆలయ ప్రాంగణం భవానీ రద్దీగా మారిపోయింది.

వీరవిల్లి అగ్రహారంలో..

మాడుగుల రూరల్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా వీరవిల్లి అగ్రహారంలోని శ్రీదత్తపీఠంలో చండీ హోమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: మండలంలోని మాకవరపాలెం, బీసీ కాలనీతో పాటు రామాలయం వీధి, తూటిపాల, బూరుగుపాలెం, జంగాపల్లి లచ్చన్నపాలెం, బీఎస్‌పేట గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా సోమవారం ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం, పల్లావూరు, లింగంపేట, తదితర గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: వడ్డాది, విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట, రాజాం, తురకలపూడి, సీతయ్యపేట గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలను ఏర్పాటు చేశారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించారు. స్థానిక నాయుడువీధిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ, తదితరులు పూజలు చేశారు.



రావికమతం మండలం చినపాచిలలో అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

భారీ వర్షం



చెరువుకు గండి పడి రాజాం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

దేవరాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) మండలంలో సోమవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, 113.50 దాటకుండా వరద నీటిని విడుదల చేస్తున్నామని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

మాడుగులలో..

మాడుగుల/మాడుగుల రూరల్: మాడుగుల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఆ తరువాత వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. పలు చోట్ల రోడ్లపై గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

రాజాం చెరువుకు గండి

బుచ్చెయ్యపేట: మండలంలో సోమవారం రాజాం అప్పలనాయుడు చెరువుకు గండి పడింది. దీంతో రాజాం తట్టబంద రోడ్డుపై నీరు ప్రవహించడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇద్దరు ద్విచక్ర వాహనచోదకుల సెల్‌ఫోన్లు నీటిలో పడి కొట్టుకుపోయాయి. ఎంత వెదికినా దొరకకపోవడంతో ఆవేదన చెందారు. బీఎన్ రోడ్డులో గల తాచేరు, పెద్దేరు నదులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో వడ్డాది కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించింది.

డ్రోన్ కెమెరాలతో ముమ్మర తనిఖీలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, ఏజెన్సీ ముఖద్వారమైన భీమవరం పోలీస్ చెక్‌పోస్టు, తదితర ప్రాంతాల్లో గొలుగొండ ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో సోమవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. గంజాయి నిర్మూలన చర్యల్లో భాగంగా పలు చోట్ల డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు.


చందాలతో మెరక కాలువ గట్టు పనులు

మాకవరపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు చందాలు వేసుకొని మాకవరపాలెం మెరక కాలువ పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మాకవరపాలెం మెరక కాలువకు గండి పడింది. దీంతో భారీ ఎత్తున సాగునీరు సర్పానదిలోకి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే నిధులు వస్తే తప్ప పనులు చేపట్టలేమని చేతులెత్తేశారు. దీంతో చేసేదిలేక రైతులు చందాల రూపంలో సుమారు రూ.40 వేలు వసూలు చేసి మెరక కాలువ గట్టు పనులు చేపట్టారు. సోమవారం గట్టు పనులు పూర్తి చేసి సర్పానది నుంచి వచ్చే సాగునీటిని కాలువకు విడుదల చేశారు.

రైవాడ నీటి సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైవాడ జలాశయ ఎడమ కాలువకు నీరు సరఫరా చేసే ప్రధాన తూము షట్టర్ల మరమ్మతు పనులు చేస్తుండగా ఇనుప గేటు జారిపోవడంతో నీరు సరఫరా చేసే రంధ్రానికి అడ్డు పడి అంతరాయం కలిగింది. ఈ కాలువ ద్వారా ఆయకట్టుకు, జీవీఎంసీకి తాగునీరు సరఫరా అవుతుంటుంది. ఈ షట్టర్‌ని ఇంటెక్ చాంబర్ లోపల ఇనుప గొలుసుల సహకారంతో బయటకు తీస్తుండగా పెద్ద శబ్దంతో నీటిలో పడిపోయింది. జలాశయం డీఈఈ సత్యంనాయుడు, జలాశయం చైర్మన్ పాత్రునాయుడు వెంటనే స్పందించి ఇంటెక్ చాంబర్ మదుంకు అడ్డంగా ఉన్న షట్టర్‌ను బయటకు తీయించే పనులను ముమ్మరం చేశారు.

కల్యాణపులోవ జలాశయం కళకళ



నిండుకుండలా ఉన్న జలాశయం

రావికమతం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్ వరద నీటితో కళకళలాడుతోంది. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి పరివాహక ప్రాంతం ఎగువన కురిసిన వర్షాలకు కొండ గెడ్డల ద్వారా గత రెండు రోజులుగా 300 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండంతో 457.20 అడుగుల మేర నీటి నిల్వలు పెరిగాయి. వస్తున్న ఇన్‌ఫ్లోకి అనుగుణంగా ప్రధాన తూము ద్వారా వంద క్యూసెక్కుల నీటిని ఆయకట్టు కాలువలకు విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈ డి.సూర్య సోమవారం తెలిపారు.

62వ రోజుకు చేరిన నిరసన దీక్ష

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం జి.కోడూరులోని రాయి క్వారీ లీజు అనుమతులు రద్దు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత రైతులు చేపట్టిన నిరసన దీక్ష 62వ రోజుకి చేరింది. సోమవారం రెవెన్యూ అధికారులు టెంట్ తొలగించడంతో నిరసనకారులు ఎండకు, వానకు రక్షణగా గొడుగులు వేసుకొని నిరసన కొనసాగించారు. నిరసన దీక్షకు సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు, ఈర్లి చిరంజీవి, ఐద్వా నాయకులు గౌరీ, సూర్య ప్రభ సంఘీభావం తెలిపారు.

400 ఎకరాల ప్రభుత్వ భూమి కాజేసేందుకు యత్నం

- రెవెన్యూ, టీడీపీ నేతలపై మాజీ ఎమ్మెల్యే పెట్ల ఆరోపణ

మాకవరపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి రెవెన్యూలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు రెవెన్యూ, టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. ఈ భూమిపై విచారణ జరపాలని సోమవారం తహసీల్దార్ జి.వెంకటరమణకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, నాయకులు యర్రా పాత్రుడు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

కూటమి నాయకులపై మాజీ ఎమ్మెల్యే గణేష్ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, మాజీ ఏపీసీఎస్ అధ్యక్షుడు అల్లు రామునాయుడు హితవు పలికారు. 737 సర్వే నంబరులో భారీ భూ కుంభకోణం జరిగిపోతోందని వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కంపెనీ కోసం రైతుల సాగులో ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి వారికి నష్టపరిహారం ఇచ్చి భూములు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.

'పట్నం యార్డు అభివృద్ధిపై స్పీకర్ సమీక్ష

- రైతు బజార్ ఆధునికీకరణ, గోదాములు, దుకాణ సముదాయం నిర్మాణంపై ఆరా తీసిన అయ్యన్నపాత్రుడు



అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధిపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం అమరావతిలోని తన కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. రూ.95 లక్షలతో రైతు బజార్ ఆధునికీకరణ, రూ.43 లక్షలతో గోదాములు, దుకాణ సముదాయం నిర్మాణం గురించి చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన భూసార పరీక్షా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ మంత్రి ఓఎస్‌డీ పోలినాయుడు నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ సంబరాలు

- మోదీ, నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం



ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కె.కోటపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి పండుగ కానుక అందించిందని బీజేపీ నాయకుడు చల్లా సత్యనారాయణమూర్తి అన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన సందర్భంగా సోమవారం బీజేపీ అధ్యక్షురాలు పైలా అమ్మాజీ ఆధ్వర్యంలో కార్యకర్తలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చారు. పార్టీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు, పార్టీ నాయకులు వర్రీ వెంకటరావు, శరగడం సన్యాసినాయుడు, బండారు శ్రీనివాసరావు, బండారు శ్రీరామమూర్తి, జనపరెడ్డి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

చోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ఇన్‌చార్జి వై.మౌనిక తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ఉంటుందని, ఆసక్తి కలిగిన పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన యువతీ యువకులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తొలి బ్యాచ్‌లో కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయని, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 9908799126, 9494791935 ఫోన్ నంబర్లను సంప్రతించాలని సూచించారు.

నేడు చోద్యంలో కోటకొండమ్మ పండుగ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో మంగళవారం కోటకొండమ్మ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామ సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తెలిపారు. పండుగ రోజు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

25న మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ చేయనున్నట్టు వాసవీక్లబ్ అధ్యక్షుడు చెక్కా సంతోశ్ తెలిపారు.

పెయ్యి దూడల ఉత్పత్తి పథకం ద్వారా రైతులకు మేలు

- పశుసంవర్ధకశాఖ ఏడీ జి.శ్రీనివాసరావు

చోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా పెయ్యి దూడల ఉత్పత్తి పథకం కింద కేవలం రూ. 150కే లింగ నిర్ధారిత వీర్యం ఇంజెక్షన్ పాడి రైతులకు అందుబాటులోకి వచ్చిందని స్థానిక పశు సంవర్ధకశాఖ ఏడీ జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గతంలో రూ.500కి ఇచ్చే ఈ ఇంజక్షన్ ప్రస్తుతం రూ.150కే ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని, దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాలలో మేలు జాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా ఆడపెయ్యి దూడలు ఎక్కువగా ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. తద్వారా పాల దిగుబడి పెంచడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ముర్రా, జెర్సీ హెచ్ ఎఫ్, జెర్సీక్రాస్, హెచ్ ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ తదితర జాతుల లింగనిర్ధారిత వీర్యం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పథకంపై ఆసక్తి కలిగిన రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను కానీ, గోపాలమిత్రలను కానీ సంప్రతించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి

నాతవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు కోరారు. సోమవారం నాతవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయల స్టాల్‌ను సందర్శించి కూరగాయలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కొండాజీ గోపాలకృష్ణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని డిమాండ్

మాడుగుల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల గిరిజన గ్రామాలకు సంబంధించి నూతన పంచాయతీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయ అధికారులకు పలువురు వినతి పత్రాన్ని అందించారు. మండలంలో జాలంపల్లి పంచాయతీలో రాయిపాలెం, కుముందానిపేట, కొర్ర మామిడిపాలెం, రాచ గొప్పూరు, సిరిపురం, పెద పిట్టగెడ్డ, మర్రిపాలెం, గొప్పులపాలెం, చిన పిట్టగెడ్డ, కొత్తపల్లి, కామకూటం, కొండవీధి గ్రామాలకు చెందిన ప్రజలు ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, డిప్యూటీ తహశీల్దార్ రాజాకి వినతి పత్రాలను అందించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన చేయండి

చోడవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని, లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ దిశగా సాధన చేయాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి సూచించారు. సోమవారం స్థానిక ఉషోదయ కళాశాలలో రమణాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగవకాశాలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేవలం చదువు ఉంటే సరిపోదని, చదువుతో పాటు నైపుణ్యాలు కూడా పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత విద్యాశాఖాధికారి వినోద్‌బాబు, కాలేజీ కరస్పాండెంట్ కృష్ణకుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్‌జీ, డీన్ ఎస్‌వీ వాసు, ప్రిన్సిపాల్ మూర్తి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన నేతలు


సీఎం చంద్రబాబును కలిసిన ఎంపీ సీఎం రమేశ్


బత్తుల తాతయ్యబాబు


బుద్ద నాగజగదీశ్వరరావు


మళ్ల సురేంద్ర


పీవీజీ కుమార్


కోట్ని బాలాజీ


ప్రగడ నాగేశ్వరరావు


పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సోమవారం విశాఖపట్నం విమానాశ్రయంలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు, కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసి స్వాగతం పలికిన వారిలో ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ టీడీపీ నాయకులు కలిశారు.

స్కానింగ్ సెంటర్లను విధిగా పర్యవేక్షించాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లను అధికారులు విధిగా పర్యవేక్షించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం మాతాశిశు మరణాలు, పీసీపీఎన్‌డీటీ జిల్లా అథారిటీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని తప్పకుండా అమలు చేస్తామన్నారు. జిల్లాలో ఏప్రిల్ ఒకటి నుంచి జూలై 31 వరకు జరిగిన మాతృ మరణాలు, శిశు మరణాలు, ఒకటి నుంచి ఐదు ఏళ్ల లోపు పిల్లల మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ కృష్ణారావు, పీసీపీఎన్‌డీటీ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, పలువురు వైద్యులు, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

పూడిమడక తీరానికి కొట్టుకువచ్చిన బోటు

అచ్యుతాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పూడిమడక తీరానికి సోమవారం ఉదయం ఒక బోటు కొట్టుకు వచ్చింది. దీనిని మత్స్యకారులు పగుల గొట్టి కలపను తీసుకుపోయారు. పూడిమడక శివారు కొండపాలెం-కడపాలెంల మధ్య ఒక బోటు సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో అలల ఉధృతికి పూడిమడక తీరానికి రావడాన్ని మత్స్యకారులు గమనించారు. ఉదయం సుమారు ఏడున్నర ప్రాంతంలో కొండపాలెం, కడపాలెం మధ్యకు బోటు తీరానికి చేరింది. విషయం తెలుసుకున్న పూడిమడక మెరైన్ పోలీస్ సిబ్బంది బోటును క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో ఎటువంటి విలువైన వస్తువులు లేవు. అంతేకాక బోటు బాగా శిథిలావస్థకు చేరుకుంది. అలాగే బోటుకు ఉన్న నంబరు కూడా నలుపు పెయింట్‌తో చెరిపేసి ఉంది. ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారులకు మెరైన్ పోలీసులు తెలిపారు. కాగా కొత్త బోటును కట్టించుకున్న యజమానులు పాత బోటును ఇలా సముద్రంలో వదిలేయడం పరిపాటని, అందువల్లే బోటుకి ఉన్న నంబరును నలుపు పెయింట్‌తో చెరిపేసి ఉంటారని మెరైన్ పోలీస్ సిబ్బంది తెలిపారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 58501, 58502 నంబర్లు గల పాసింజర్ రైళ్లకు ఈ నెల 23 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ క్లాసు కోచ్‌ను అదనంగా జత చేస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ప్రారంభం


పద్య నాటకంలో సన్నివేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం కనకదుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి గౌరీ సంఘంలోని కర్రి రమేశ్ వేదికలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నాటకోత్సవాలను వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నాటక సమాజాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి వరహా నూకరాజు, కర్రి సన్యాసినాయుడు, బుద్ద శివాజీ, కొణతాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం జిల్లా మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ ప్రదర్శించిన శ్రీరామ పాదుక పట్టాభిషేకం పద్య నాటకం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించి దశరథుడు పాత్ర ధరించారు. శ్రీరాముడిగా చిలువేరు శాంతయ్య, లక్ష్మణుడిగా కిశోర్, భరతుడిగా రమణ, సుమంతుడుగా సాంబశివ, వశిష్టుడిగా కోటి, కైకగా అమృత వర్షిణి, సీతగా సురభి పూజిత నటించారు.

అంధకారంలోనే ఎలమంచిలి

... 5వ పేజీ తరువాయి

వారు ఇబ్బంది పడ్డారు.

విద్యుత్ శాఖకు రూ.30 లక్షలకుపైగా నష్టం

ఈదురుగాలుల కారణంగా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. పట్టణంలో గాంధీనగర్, కొత్తపేట, పెదపల్లిరోడ్డు, నాగేంద్ర కాలనీ, మెయిన్ రోడ్డు, ఎల్‌ఐసీ కార్యాలయం జంక్షన్, రైల్వే స్టేషన్ రోడ్డు, తులసీనగర్, ద్వారకానగర్, పోస్టాఫీసు కార్యాలయం రోడ్డు, సీహెచ్‌సీ ప్రాంతంతోపాటు కొక్కిరాపల్లి, అగ్రహారం ప్రాంతాల్లో విద్యుత్ విద్యుత్ స్తంభాలు విగిపోయి వైర్లు తెగిపోయాయి. మొత్తం మీద రూ.30 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ కనకరాజు తెలిపారు.

100 కిలోల గంజాయి స్వాధీనం

.. 5వ పేజీ తరువాయి

రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. వీరిలో ఐదుగురు.. బిసోయి బాలరాజు, తారాడ లింగంనాయుడు, గొల్లోరి అనిల్‌కుమార్, పాంగి అశోక్ కుమార్, కొర్రా శామ్యూల్ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వారు. మిగిలిన ఇద్దరు అజయ్, రాహుల్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు. రెండు కార్లు, ఒక వ్యాన్‌ను సీజ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన నిందితులపై గతంలో పలు గంజాయి కేసులు వున్నట్టు తమ విచారణలో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

» కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరిక


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు ప్రజలను నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలన్నారు. ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పీజీఆర్‌ఎస్ ముగిసే సరికి 241 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అర్జీలకు ప్రాధాన్యతం ఇవ్వండి

» ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో పోలీస్‌శాఖకు అందే అర్జీల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి చూపాలని అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని పౌరుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో జిల్లా పోలీసులు చొరవ చూపాలన్నారు. పీజీఆర్‌ఎస్‌కు 31 అర్జీలు అందినట్టు జిల్లా పోలీస్ కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏటా 7 లక్షల మంది పేదలకు వరుణ్ గ్రూపు వైద్య సేవలు

» సంస్థ చైర్మన్ ప్రభు కిషోర్



మాట్లాడుతున్న వరుణ్‌గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్

విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుణ్ గ్రూప్ వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవలోనూ ముందుంటుందని, అందులో భాగంగా ఏటా 7 లక్షల మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందని వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ అన్నారు. వరుణ్ గ్రూప్ 75వ వార్షికోత్సవం భారతీనగర్‌లోని నోవాటెల్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వర్ష పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వరుణ్‌గ్రూప్ 75 ఏళ్లుగా వైభవంగా కొనసాగుతుందన్నారు. 1950లో దివంగత కేశవరావు చౌదరి దీర్ఘదృష్టితో విజయవాడ పద్మజ కమర్షియల్ కార్పొరేషన్ (పీసీసీ)ను స్థాపించారన్నారు. అప్పట్లో జెటర్ ట్రాక్టర్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ వ్యాపారంతో చిన్నగా మొదలైన సంస్థ నేడు వరుణ్ గ్రూప్‌గా విస్తరించిందన్నారు. మూడో తరం వారసుడైన వరుణ్‌దేవ్ 2007లో మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, సంస్థ పరిధిని విస్తరిస్తున్నారన్నారు. వరుణ్ గ్రూప్ నేడు, సుజుకి 4-వీలర్లు, 2-వీలర్లలో ప్రపంచంలోనే నెంబర్‌వన్ డీలర్‌గా, బజాజ్ 2 వీలర్లు, 3 వీలర్లలోనూ ప్రపంచ నెంబర్ వన్ డీలర్‌గా నిలిచిందన్నారు. ప్రస్తుతం 21,600 మందికి పైగా ఉద్యోగులు, 856 కస్టమర్ టచ్ పాయింట్స్ ద్వారా ఏటా 1.7 లక్షలకు పైగా వాహనాలను విక్రయిస్తూ, 20 లక్షలకు పైగా వాహనాల సర్వీసింగ్‌తో దేశంలోనే అతి పెద్ద ఆటోమొబైల్ గ్రూప్‌గా నిలిచిందన్నారు. ఆటోమొబైల్ రంగం దాటి 2011లో నోవాటెల్ విశాఖపట్నం వరుణ్‌బీచ్, హోటల్ హాస్పిటాలిటీ రంగంలో అడుగుపెట్టిన వరుణ్ గ్రూప్, ఈ ప్రాజెక్ట్ తూర్పుతీరంలో లగ్జరీకి కొత్త నిర్వచనం తీసుకువచ్చిందని వివరించారు. నోవాటెల్ విజయవాడ వరుణ్ ప్రారంభించి అతిథ్య రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసిందని, కొత్త హాస్పిటాలిటీ ప్రాజెక్టులు అమరావతి, హైదరాబాద్‌లో రాబోతున్నాయన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ మాట్లాడుతూ 1975లో ప్రభుకిషోర్ కుటుంబం వ్యాపారంలో చేరారని, 2025 నాటికి 50 ఏళ్ల నాయకత్వంతోపాటు సేవా ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారన్నారు. ఆయన నాయకత్వంలో వరుణ్ గ్రూపు క్రమశిక్షణ, నిబద్ధత, సమగ్ర దృష్టి, నిజాయితీ వంటి విలువలతో వివిధ రంగాల్లో విస్తరింపజేశారన్నారు. ఉద్యోగులు, కస్టమర్లు, ప్రిన్సిపల్స్, బ్యాంకర్లు, ప్రభుత్వం అనే ఐదు వేళ్ల సిద్ధాతం పట్ల ఆయన నిబద్ధత గ్రూప్ నిరంతర విజయానికి మూలస్తంభమన్నారు. 2009లో తన తల్లిదండ్రులు నవరత్నం, కేశవరావు స్మారకార్థం ప్రభుకిషోర్ రాష్ట్రవ్యాప్తంగా హెల్త్‌సెంటర్లను స్థాపించారని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 9 హెల్త్ సెంటర్లు, ప్రతి ఏటా 7లక్షలకు పైగా పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాయన్నారు. 2010లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏడు వరుణ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్‌ని ప్రారంభించగా, ఇప్పటివరకు 4వేల మందికి పైగా యువత శిక్షణ పొంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్‌గ్రూప్ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

లాభం.. అంతంతమాత్రం!

... 5వ పేజీ తరువాయి

చపాతీ, రోటీ, కొన్ని రకాల మందులు, నోట్‌బుక్స్ ఎక్సర్‌సైజ్ బుక్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, క్రయాన్స్ వంటివి 12 శాతం శ్లాబు నుంచి జీరో శ్లాబులోకి మార్చారు. అంటే వీటిపై జీఎస్టీ వసూలు చేయకూడదు.

అలాగే కండెన్స్‌డ్ మిల్క్, బటర్, నెయ్యి, చీజ్, రూ.2,500 కంటే తక్కువ ధర గల ఫుట్‌వేర్, వస్త్రాలు, కాటన్, జ్యూట్ హ్యాండ్‌బ్యాగ్స్, కొన్ని రకాల ఫర్నిచర్, కిరోసిన్‌స్టవ్, లాంతర్లు, డ్రై ఫ్రూట్స్, డయాబెటిక్ ఫుడ్స్, వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తి పరికరాలు 12 శాతం నుంచి ఐదు శాతం శ్లాబ్‌లోకి మార్చారు. టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్ కూడా ఐదు శాతం శ్లాబులోకి వచ్చాయి. ఎయిర్ కండిషన్లు, డిష్, వాషింగ్ మెషీన్లు, 1200 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల పెట్రోల్, 1500 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల డీజిల్ వాహనాలు 28 శాతం నుంచి 18 శాతం జీఎస్టీ శ్లాబులోకి మారాయి.

తగ్గింపు వీటికే పరిమితం..

తగ్గిన జీఎస్టీ శ్లాబులను జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అమలుచేశారు. మిల్క్, చీజ్, నెయ్యిలపై తగ్గింపు ధరలు అందుబాటులోకి వచ్చాయి. లీటరు పాల ప్యాకెట్‌పై రూ.3 వరకు తగ్గగా, 500 గ్రాముల నెయ్యిని కంపెనీని బట్టి రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించారు. పన్నీర్ ధర కిలోకు రూ.20నుంచి రూ.25 వరకు తగ్గింది. మిల్క్‌షేక్‌లు, ఫ్లమ్ కేక్స్‌పై రెండు నుంచి ఐదు రూపాయల వరకు తగ్గింది. 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో కార్లు, బైక్‌ల ధరలు దిగి వచ్చాయి. కంపెనీ ధరను బట్టి కనిష్ఠంగా రూ.ఆరు వేల నుంచి రూ.15 వేలు వరకు తగ్గింది. కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.10 లక్షల వరకు తగ్గినట్టు షోరూమ్ యజమానులు చెబు తున్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లు భారీగా రేట్లు తగ్గించాయి. ఇద్దరు పిల్లలున్న కుటుంబానికి (వయసును బట్టి) రూ.10 లక్షల పాలసీకి ఇప్పటివరకు రూ.24 వేల నుంచి రూ.28 వేల వరకు వసూలు చేస్తుండగా, దీనిపై జీఎస్టీని పూర్తిగా మినహాయించడంతో రూ.19 వేల నుంచి రూ.20 వేల మధ్య అందుబాటులోకి వచ్చాయి. ఇక ఏసీ, డిష్ వాషర్, టీవీలు 28 శాతం నుంచి 18 శాతం శ్లాబుల్లోకి మార్చడంతో ధరలు తగ్గాయి. సామర్థ్యాన్ని బట్టి ఏసీపై రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు, డిష్ వాషర్‌పై రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, టీవీలపై రూ.4 వేల నుంచి రూ.పది వేలు తగ్గించి విక్రయిస్తున్నారు.

తగ్గని వస్తువులు ఇవే..

జీఎస్టీ శ్లాబులు మేరకు ధరలను తగ్గించి విక్రయించాలని కేంద్రం ఆదేశించినప్పటికీ అనేక మంది వ్యాపారులు పట్టించుకోలేదు. టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్‌ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్ కేక్, బిస్కెట్స్ కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్ ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్ ధరలు తగ్గలేదు. వస్త్రాలు, ఫుట్‌వేర్‌లకు పాత ధరలే వసూలు చేశారు. జిల్లాలో 850 కిపైగా మెడికల్ స్టోర్స్ ఉండగా తగ్గింపు ధరలకు అమ్మకాలు సోమవారం ప్రారంభం కాలేదు. అయితే బిల్లులో తగ్గిన జీఎస్టీలను చూపిస్తూ డిస్కౌంట్ రేట్లను పెంచి వసూలు చేస్తున్నారు. తాము ఇప్పటికే జీఎస్టీ చెల్లించి సరకులు కొనుగోలు చేశామని, వాటిని తగ్గించి విక్రయిస్తే నష్టపోతామని కొందరు వ్యాపారులు వినియోగదారులతో వాదనకు దిగుతున్నారు.

24న విజయవాడకు డీఎస్సీ అభ్యర్థులు

» 25న నియామక పత్రాల అందజేత

» వచ్చే నెల మూడో తేదీ నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

» 10న కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన 1,134 మంది ఈనెల 24న విజయవాడ బయలుదేరనున్నారు. ఆరోజు ఉదయం ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం నుంచి బస్సులు బయలుదేరతాయి. అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరిని అనుమతించనున్నారు. ఈ నెల 25వ తేదీన అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేస్తారు. విజయవాడలో నియామక పత్రాలు అందుకున్న తరువాత తిరిగి జిల్లాకు తీసుకువస్తారు. అలాగే దసరా సెలవులు ముగిసిన తరువాత అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు నూతన ఉపాధ్యాయులకు కేటగిరీల వారీగా శిక్షణ ఇస్తారు. ఇందుకు సబ్బవరం, రుషికొండ ఐటీ హిల్స్‌లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. శిక్షణ చివరిరోజు పదో తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అందుకు ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీల వివరాలను సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పాడేరు డివిజన్, అనకాపల్లి జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. వీటిని ఈ పర్యాయం భర్తీ చేస్తారు. ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన కౌన్సెలింగ్‌లో మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీలో పనిచేస్తూ బదిలీ అయినవారు చాలామంది ఇప్పటివరకూ రిలీవ్ కాలేదు. ఆయా పోస్టుల్లోకి వెళ్లేందుకు టీచర్లు లేకపోవడమే అందుకు కారణం. డీఎస్సీలో ఎంపికైన టీచర్లను అక్కడకు పంపి, వారిని రిలీవ్ చేస్తామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

క్రైం... crime news

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు


నిందితుడిని పట్టుకున్న పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన వ్యక్తిని సోమవారం సుంకరమెట్ట జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చోరీలకు పాల్పడిన పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన గేదెల రాజశేఖర్(42)ను అరెస్టు చేసి బంగారం వస్తువులను ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ ఏడాది మే 13వ తేదీన గాంధీనగరం ఇన్‌కంటాక్స్ వీధిలో కొమ్మోజు రాజేశ్వరి ఇంట్లో రాజశేఖర్ చోరీకి పాల్పడి 20 తులాల వెండి వస్తువులు, నాలుగున్నర తులాల బంగారం వస్తువులు అపహరించుకుపోయాడన్నారు. ఈ నెల 10వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిసినికాడ గ్రామంలో మళ్ల నూకఅప్పారావు ఇంట్లో చోరీకి పాల్పడి అరతులం బంగారం ఉంగరం అపహరించుకుపోయాడన్నారు. చోరీలకు పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తుండగా సోమవారం ఉదయం నిందితుడు రాజశేఖర్ పట్టణ ఎస్‌ఐకి పట్టుబడ్డాడన్నారు. క్లూస్ సిబ్బంది సేకరించిన వేలిముద్రల ఆధారంగా చోరీలకు పాల్పడిన వ్యక్తి రాజశేఖర్‌గా గుర్తించామన్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి 29.200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ ఎస్‌ఐ సంతోశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురి అరెస్టు

మునగపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో నాగులాపల్లి గ్రామానికి చెందిన చల్లా వెంకయ్యకు చెందిన నాలుగు ట్రాక్టర్ రిమ్స్ చోరీ చేసిన సంఘటనలో నలుగురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అదే విధంగా మునగపాక కొత్తమహాలక్ష్మి పురిటిగెడ్డ రైతు మూల ప్రాంతంలో పెంటకోట రామనాగఅప్పారావుతో పాటు పలువురు రైతులకు చెందిన వ్యవసాయ పనిముట్లు చోరీ చేసిన సంఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణానికి సమీపంలోని తాడి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని జీఆర్‌పీ ఎస్‌ఐ కెటీఆర్ లక్ష్మి తెలిపారు. మృతుడు 5.2 అడుగుల ఎత్తు ఉంటాడని, జుత్తు నలుపు తెలుపు రంగులో ఉందని, కుడి కాలు మోకాలు కిందకు విరిగిపోయిందన్నారు. అతను చిలకాకుపచ్చ ఫుల్‌హ్యాండ్ షర్టు, నలుపు రంగు ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. వయసు సుమారు 68 ఏళ్లు ఉంటుందని, సంఘటన జరిగిన ప్రాంతంలో ఎంత గాలించినా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడు ఆచూకీ తెలిస్తే జీఆర్‌పీకి సమాచారం అందివ్వాలని ఎస్‌ఐ లక్ష్మి కోరారు.

క్వారీ పేలుడు సామగ్రి లభ్యం

» వేటజంగాలపాలెంలో 445 జెలటిన్ స్టిక్స్, 69 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్వాధీనం

» పోలీసుల అదుపులో నిందితుడు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

కొత్తూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం గ్రామంలోని ఒక ఇంట్లో నిల్వ చేసిన క్వారీ పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జి.రవికుమార్ సోమవారం తెలిపారు. అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ, తన సిబ్బందితో ఆదివారం రాత్రి నిల్వ చేసిన ఇంటిలో సోదాలు చేయగా, బాత్‌రూములో రెండు అట్టబాక్సుల్లో 445 జెలటిన్ స్టిక్స్ ఎలక్ట్రిక్ డిటోనేటర్‌లు 37, నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్ 32 లభ్యమయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన నిందితుడు గేదెల బాబూరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా ఆ నివాసాన్ని సాయంత్రం క్లూస్ టీంతో తనిఖీలు నిర్వహించినట్టు తెలిసింది.

గిరినాగు హల్‌చల్


రైవాడలో గిరినాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం సమీపంలో కాలువ వద్ద గిరినాగు సోమవారం కలకలం సృష్టించింది. దీనిని చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురై వైల్డ్ లైఫ్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. సొసైటీ సభ్యుడు కృష్ణ అక్కడికి వచ్చి గంటసేపు శ్రమించి దానిని పట్టుకున్నారు. రక్తపొడను మింగి కదల్లేని స్థితిలో ఉన్న ఏడడుగుల గిరినాగును పట్టుకుని దట్టమైన అడవులో విడిచి పెట్టినట్టు కృష్ణ తెలిపాడు.

కుండపోతగా వాన

... 5వ పేజీ తరువాయి

లింగంపేట, గింజర్తి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం పడింది. బోడ్డేరు గెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. చెరువులు ఇప్పటికే నిండాయి. వర్షంకారణంగా కృష్ణాదేవిపేట వారపుసంతలో వ్యాపారాలు సాగలేదు.

కోటవురట్ల మండలంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల పాటు భారీవర్షం కురిసింది. గెడ్డలు వాగుల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. వరి, చెరకు, కూరగాయ పండలకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐటీ సేవలు మరింత విస్తృతం

... 5వ పేజీ తరువాయి

ఈ-గవర్నెన్స్ సదస్సులో పాల్గొన్న ఆయన ఆ తరువాత కేంద్ర కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పరిపాలనా సంస్కరణల్లో వినూత్న విధానాలు అనుసరిస్తున్న రాష్ట్రాలకు ఈ సదస్సులో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ అవార్డులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఏపీలో ఆర్‌టీజీఎస్ అమలు చేస్తున్నామని, అందులో లోపాలు, ఇంకా తీసుకోవలసిన చర్యలు ఏమైనా సూచించాలని వారిని కోరారు. ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, వాటిని ఏపీలో అమలు చేయడానికి గల అవకాశాలపై చర్చించారు. విజయవంతమైన మోడళ్లను ఏపీలో ప్రవేశపెడతామని, వాటికి సంబంధించిన అంశాలను విజయవాడకు వచ్చి తమకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు వివరించి సూచనలు కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544